

# భయం

**• చంద్ర •**

కంపార్ట్‌మెంటులో వాళ్ళిద్దరూ తప్ప మరో మనిషి లేడు. ఉత్తరంగా ఢిల్లీ నుంచి ఇంతవరకూ వొచ్చి మద్రాసు బయల్దేరింది — రైలు. రైల్లో జనం ఎక్కువలేరు. నాగపూర్‌లో ఇద్దరు ఎక్కేరు. ఒకడు మధ్యలో ఎక్కడో దిగిపోయాడు. రెండోవాడు మటుకు ఇంకా కిటికీ దగ్గరే కూచున్నాడు.

తను మొదటిసారిగా ఇంత దూర ప్రయాణం పెట్టుకున్నది. ఎమ్మెస్సీ పాసయ్యేక ఆర్నెల్లు తిరిగాయో లేదో ఇప్పుడు మద్రాసులో ఉద్యోగం వొచ్చింది.

కంపార్ట్‌మెంటులో చీకటి .... ఒంటరి తనంవూ....

తను ఓసారి ఆ చీకట్లో కళ్లు విప్పి చూస్తే అతను కిటికీ దగ్గర కూచుని ఇంకా సిగరెట్టు కాలుస్తూ కనిపించేడు.

ఆమె ఓసారి నిట్టూర్చింది. ప్రక్కకు తిరిగి కాళ్ళని దగ్గరగా లాక్కుంది. దుప్పటిని వీపు మీదనుంచి గుండెల మీదకు కప్పుకుంది. వెనక్కి ఒరిగి కిటికీ కానుకుని నిద్రపోయేందుకు ప్రయత్నించింది. నిద్ర పట్టక విసుగొచ్చి కళ్ళని టప టపలాడించి లేచి కూచుంది.

చూస్తే—

మూసివున్న తలుపు అటూ యిటూ ఊగులాడుతూ కనిపించింది.

ఆమెకి భయం వేసింది.

లేచి వెళ్ళి తలుపు వేసివొస్తే బావుణ్ణని పించింది. కాని లేచివెళ్లేందుకు మళ్ళీ భయం!

అలాగే కదలకుండా వెనక్కి జార్లబడి కూచునే తలుపువేపు భయం భయంగా "లోపలికి ఎవరొస్తారో" నని అనుకుంది.

స్విచ్ వేసిచూస్తే బావుణ్ణు!

స్విచ్ చేయి చాస్తే అందుతుంది.

కాని, దుప్పట్లోంచి కదిలేందుకు భయం వేస్తోంది.

ఉన్నట్టుండి తలుపు కదలటం ఆగి పోయింది.

తలుపు బయట ఎవరేనా వున్నారేమో!

కాళ్ళకింద దుప్పటి ఉండలా వుంది.

కదిలితే—

కిటికీ దగ్గర అతను కనిపించేడా చీకట్లో.

"ఫరవాలేదు. ఈ కంపార్ట్‌మెంటులో తనకి తోడుగా అతనున్నాడు!"


ఆమెకి కొంత భయం తగ్గింది. ప్రాణం లేచొచ్చింది.

కళ్ళ చివర్లలోంచి ఓరగా చూస్తే అతను కిటికీకి తలాన్చి కళ్ళు మూసుకున్నట్టున్నాడు. కానతను నిద్రపోతున్నట్టు లేదనిపించింది. వీస్తున్నగాలికి జుత్తు ఎగుర్తూ, కుడిచేతి వేళ్ళమధ్య సిగరెట్టు నిప్పురవ్వల్ని విరజిమ్ముతూంది.

ఆమె చటుక్కున చేయిచాచి లైట్ స్విచ్ ఆన్చేసింది. కంపార్ట్‌మెంటులోకి వెన్నెలలాగ వెలుగొచ్చింది. స్విచ్ దీపానికి కాకుండా అతని కళ్ళకన్నట్టు విరజిమ్మిన వెలుగుకి అతను కళ్ళు తెరిచాడు.

అతను శబ్దం చేస్తున్న తలుపునోసారి చూసేడు. తరువాత పక్కకు తిరిగి బెర్త్ మీద పడుకున్న ఆమెని చూసేడు.

ఆమె కళ్ళల్లో అతని కామె పరిస్థితి అర్థమయ్యింది. ఓసారి లేచి తన డ్రెస్ నోసారి సరి చేసుకున్నాడు. తల తిప్పి కిటికీలోంచి బయటకు చీకట్లోకి చూసేడు. క్షణం తర్వాత చటుక్కున లేచి కాళ్ళకు చెప్పులేసుకుని వెళ్ళి తలుపును లాక్ చేసివొచ్చి తనసీట్లో కూచుని మళ్ళీ ఓ సిగరెట్టు వెలిగించేడు. గట్టిగా ఓ దమ్ము లాగి పొగని బయటికి వొదిలేడు. ప్రక్కకు తిరిగి ఓ సారి కంపార్ట్‌మెంటంతా చూసి ఖాళీగా వున్న బెర్త్‌లవేపు చాలాసేపు చూస్తూండిపోయేడు కిటికీలో వుంచిన చేతివేళ్ళ మధ్య సిగిరెట్ వీస్తున్న గాలికి నిప్పు రవ్వల్ని విసుర్తోంది.




అతన్ని చూస్తూన్న ఆమెకు మళ్ళీ మనసులో ఓ మూల భయం కలిగింది. దుప్పట్నంతా పైకి లాక్కుంది.

అతను ఆమె కేసీ, ఖాళీగావున్న కంపార్ట్‌మెంటంతా కలయచూసీ ఏమీ మాట్లాడకుండానే స్విచ్ ఆఫ్ చేసేడు

కంపార్ట్‌మెంటులో మళ్ళీ చీకటి!

మధ్యనున్న నీలంరంగు దీపం ఉండీ లేనట్టుగానే వుంది.

చటుక్కున ఆమెకు తనున్న పరిస్థితి గుర్తుకొచ్చింది.

రాత్రి ప్రయాణం........లాక్ చేసిన కంపార్ట్‌మెంటులో ఒంటరిగా తనూ. అతనూ.... ...

పరాయి మగాడు!

పైగా నిద్రపోకుండా మెలుకువగా.... అతనే వెళ్ళి తలుపుల గడియవేసొచ్చేడు. రైలు బయల్దేరి నప్పట్నుంచీ తనని గమనిస్తూ వుండిపుంటాడు కూడా—

తలని తిప్పీ తిప్పకుండానే ఓరకంట అతన్ని గమనించింది.

మొదట్లో లాగానే అతను ఒళ్ళంతా రగ్గు కప్పుకొని కిటికీకి ఆనుకుని కూచున్నాడు. అతని కుడిచేయి మోచేతికింద ఓ దిండు నలిగిపోతూంది. ఎడం చేతిలో సిగరెట్టూ!

చీకట్లో చూపులు కరిగిపోయి కొద్ది కొద్దిగా అతను కనిపిస్తున్నాడు. మొహం మటుకు స్పష్టంగా కనిపించటం లేదు.

"అతను తననిగాని చూట్టం లేదు గదా" అనుకుందామె.

కాని ఆతనికేసి చూట్టాని! ధైర్యం చాలటం లేదు.

"తనసలు ఆడవాళ్ళ పెట్టెలో ఎక్కి వుంటే బావుండేది. అసలీ రైల్వేవాళ్ళకిబుద్ధి లేకుండా పోయింది, ఒంటరి ఆడదాన్ని. మరో పరాయి మొగాడితో ఖాళీ కంపార్ట్ మెంటులో బెర్త్ ఎలా ఇచ్చారు? ఇప్పుడితను ఏ అఘాయిత్యమయినా తలపెడితే "

చటుక్కున ఆమెకు తన స్త్రీత్వం గుర్తుకొచ్చింది.

"తనిట్లా మెలి తిరిగి పడుకోవటం వల్ల అతనికి తన అందం ఏమయినా కనిపిస్తోందేమో?"

ఆమె పక్కకి తిరిగి గోడకేసి మొహాన్ని తిప్పుకుని సరిగ్గా పడుకున్నది. అతనిప్పుడు ఏదయినా చేసినా ఎదుర్కొనేందుకు గబుక్కున బోర్లా పడుకోవచ్చు. దగ్గర్లో చిన్న ఆయుధం లాంటి దేదయినా వుంటే బావుణ్ణనిపించిందామెకి. చూస్తే తనకి ఆమె పర్సుతప్ప మరేమీ కనిపించ లేదు. ఆ పర్సునామె మెల్లిగా తీసి తల కింద పెట్టుకున్నది.

ఇంకిప్పుడు తనో కునుకు తీయొచ్చు ననుకున్నది. అనుకుని చీరనోసారి సర్దుకుని రొమ్ముల్నిండా కొంగు కప్పుకున్నది. కొంగు చివరని సన్నంచేసి మెడకింద జాకెట్లో బిగించింది. కప్పుకున్న దుప్పటిని కాళ్ళకింద బిగించి మెడవరకూ లాక్కుని కళ్ళు మూసుకున్నది.

చటుక్కున అతను గుర్తుకొచ్చి ఓ కన్ను తెరిచి మెల్లిగా అతనికేసి చూసింది.

అతనలాగే కూచుని సిగరెట్టు తాగుతున్నాడు.

"నన్నే చూస్తున్నాడు. ఇట్లా చీటికి మాటికీ అటూ యిటూ కదల్తూ అతన్ని ఆకర్షిస్తున్నాననుకుంటాడేమో ఇంక కదల కూడదు" అని అనుకుంది. ఆమె అలాగే కదలకుండా నీలిరంగు బల్బు వెలుగులోనే అతనికేసి చూసింది.

"ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణం చేస్తున్నంత మాత్రాన అతను మంచివాడై వుండాలని ఏముంది. అతనూ మనిషే! కోరికలకు మంచీ చెడూ అనేవుంది? ఎందుకైనా మంచిది. అతని పేరు ఏ సూటుకేసు మీదో వుంటుంది చూస్తే బావుణ్ణు" అనుకుని అతను కూచున్న సీటుకింద పరీక్షగా చూసింది, కాని అక్కడున్నది తన సూటు కేసే. అతన్ది తనున్న సీటుకింద వుండి వుంటుంది. కదిల్తే అతను చూస్తాడు. "తనసలు పొరబాటు చేసింది. కనీసం రైలెక్కాక అతన్తో పరిచయం చేసుకోవల సింది. అలా పరిచయం చేసుకుని వుండి వుంటే ఈ పాటికి చాలా మాట్లాడుకుని వుండి వుంటే ఈ పాటికి చాలా మాట్లాడు కుని వుందుము, ఇప్పుడు 'భయం వేస్తోందా?' అని అడిగేవాడు, లేపోతే 'చలి వేస్తోందా? 'అని అడిగేవాడు' అని అను కుంది.



చలి అనుకోగానే ఆమెకు నిజంగా కొద్దికొద్దిగా చలేస్తున్నట్లనిపించింది. "లేచి కార్డిగన్' తొడుక్కుంటే బావుణ్ణు. కాని ఎదుట పరాయి మగాడు వున్నాడు. పరిచయం అయివుంటే అతన్నే రగ్గు అడిగి తీసుకుని వుందును. చూడబోతే తల వెంట్రుకలు బాగా తగ్గించుకుని ఆర్మీ ఆఫీసరులా వున్నాడు. ఎదుట ఓ ఆడది చలికి బాధపడుతోంటే ఓ రగ్గు కప్పుకుని మరో రగ్గు కాళ్ళకింద పెట్టుకుని ఎంత కేర్‌లెస్‌గా ఉన్నాడు?

ఇప్పుడామెకు గుండెల్లో భయంపోయి అతనిమీద కోపం పెరిగింది.

''పోన్లే! ఆర్మీ ఆఫీసరు గనక కనీసం ఒంటరి ఆడదానిమీద అఘాయిత్యమూ చేయడు! నిజమే. అతన్ని పరిచయం

చేసుకోవటమే మంచిదయింది. లేకపోతే రైలెక్కినప్పట్నుంచీ బోరు కొట్టి వుండే వాడు. మాట్లాడి మాట్లాడీ. రైలాగిన ప్రతి స్టేషన్లోనూ కాఫీ కావాలా? టీ కావాలా? అనడుగుతూ చంపేసి ఉండే వాడు. ఆ తర్వాత కొద్ది కొద్దిగా చనువు చేసుకుని మెల్లిగా ప్రక్కకొచ్చి కూచునే వాడు. తన చేతిని చేతిలోకి తీసుకుని నిము రుతూ మెల్లిగా తలని తన మెడమీద ఆన్చేవాడు. తను కొద్దిగా వెనక్కి వాలి పోతే మెల్లిగా చేయి పైకెత్తి తన వెండ్రుకల్ని నిమురుతూ మొహాన్ని తన మొహం వేపు తిప్పుకునేవాడు....''

ఆలోచిస్తూన్న ఆమె చటుక్కున లేరుకుని మళ్లీ ఓసారి చీరనంతా సర్దుకుని గాలికి ఎగిరిన ముంగురులని సర్దుకుని దుప్పటిని సరిచేసుకుని మెల్లిగా కళ్లు మూసుకుంది.

• •

ఆమె చటుక్కున కళ్ళుమూసుకునే చెవులు రిక్కించి వింటే అతను ఇంకా మెలకువగానే వున్నాడనిపించింది. కళ్ళు తెరిచి చూసేందుకు ఆమెకు ధైర్యం చాల్లేదు గాని—అతను మెల్లిగా బెర్త్‌మీద పడుకోవటం వినిపించింది.

'కాస్సేపు అలాగే పడుకుని మెల్లిగా లేచి తన బెర్త్‌దగ్గరగా వొస్తాడు' అనుకుంది. అలా అనుకోంగానే, అతను నిజంగా తన బెర్త్ ప్రక్కని నిలబడ్డట్టుగా అనిపించిందామెకు.

చెవుల్ని మరింత రిక్కించి కళ్ళు బలంగా మూసుకుంది.

'అతను మెల్లిగా తన బుజాల్ని పట్టుకుంటాడు. అయినా సరే తను నిద్రపోతున్నట్లే నటించాలి. కుదుపుతాడు. అయినా లేపకూడదు. ఏమయినా సరే లేవకూడదు' అనుకుని రెండు చేతుల్నీ రొమ్ముకడ్డంగా అదుముకుంది. మంచి పనిచేశాను. దుప్పట్లోకి దూరకుండా మరింత లాగి కప్పుకుంటాను. థాంగాడ్! దుప్పటి చిన్నదికావటం కొంత నయమే...

• •

కళ్ళు తెరిచిచూస్తే తనమీద రగ్గు కప్పివుంది. చటుక్కున లేచి ఆశ్చర్యంగా కంపార్ట్‌మెంటంతా వెదికింది.

కిటికీలోంచి ఉదయపు నీరెండ కంపార్ట్ మెంట్‌లోకి సీట్లమీద పడుతున్నది.

గడియారం చూసుకుంటే టైము ఏడవుతున్నది. అనుమానంగా చెవికి ఆన్చి చూసుకుంది. గడియారం నడుస్తోంది.

కంపార్ట్‌మెంట్‌లో అతను లేడు.

కాని—

రాత్రి అతను పడుకున్న బెర్త్ క్రింద కాలిపోయిన ఫిల్టర్ సిగరెట్ పీకలూ, మూడు ఖాళీ విల్స్ పాకెట్లూ కనిపించేయి.